నేడు ఉచిత వైద్య శిబిరం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ రమ్యా గ్రౌండ్‌లో శ్రీమంజు హాస్పిటల్ సౌజన్యంతో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కట్టా నరసింగరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, రాండమ్ బ్లడ్ షుగర్, వెయిట్, అవసరమైన వారికి ఈసీజీ తీయబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు హాస్పిటల్ ఫోన్ 7777932772 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

బాలానగర్: ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరించిన తీరును స్వాగతిస్తున్నామని స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం విద్యార్థి నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సమర్థిస్తూ సీఎంకు బహిరంగ లేఖ రాశారు. కళాశాలల్లో సరైన సౌకర్యాలు లేకున్నా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎఫ్ఆర్‌సీకి తప్పుడు పత్రాలు సమర్పించిన కళాశాలల అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, సాగర్, సాయికుమార్, చందు, ఉదయ్, సుజయ్, రంజిత్, విశాల్, ధనుంజయ్, సిరి, లక్ష్మి, హర్షిత, శ్రావ్య పాల్గొన్నారు.

విగ్రహాల తయారీని పరిశీలించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని రామాలయంలో రాజగోపురానికి, ఇరువైపులా ప్రతిష్ఠించనున్న శ్రీహనుమాన్, గరుడ విగ్రహాల తయారీ పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. విగ్రహాలు 5 అడుగుల పీఠంపై 18 అడుగుల ఎత్తులో ఉండనున్నట్లు తెలిపారు. విగ్రహాల శిల్పాల తయారీని తమిళనాడు రాష్ట్రంలోని మహాబలిపురం వద్ద జరుగుతోందని, పనుల పురోగతిని స్వయంగా పరిశీలించేందుకు ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నాయినేని తులసిరావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, రాధాకృష్ణతో కలిసి వెళ్లారు.

బ్రోచర్ ఆవిష్కరణ

బాలానగర్: జేఎన్‌టీయులో గ్లోబల్ అల్యుమని మీట్ 2025కు సంబంధించిన బ్రోచర్‌ను తెలంగాణ విద్యా సంక్షేమ, మౌలిక వసతుల సంస్థ డైరెక్టర్, వీసీ టి. కిషన్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. అక్టోబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు 9701659933, 9912566560 నెంబర్లలో సంప్రదించవచ్చు. రెక్టార్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా జగన్నాథుడి రథయాత్ర

పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఇస్కాన్ దేవాలయం డైరెక్టర్ మహా శృంగదాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా జరిగింది. వివిధ దేశాల ఇస్కాన్ భక్తులతో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. వివిధ మఠాల పెద్దలు పాల్గొని కృష్ణ భజనలు, కీర్తలను ఆలపించారు. కోలాటాలు, నృత్యాలు చేస్తూ రథయాత్రని హైదర్‌నగర్‌లోని మహంకాళి టెంపుల్ దగ్గర నుంచి జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు ఈ రథయాత్ర పోలీస్ బందోబస్తు మధ్య ముంబయి జాతీయ రహదారిలో అంగరంగ వైభవంగా జరిగింది.



జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు



రథయాత్రలో కళాకారులతో ఇస్కాన్ డైరెక్టర్ మహా శృంగదాస్

వంద పడకల ఆసుపత్రి స్థలం అప్పగింత

ఇటీవలే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఎట్టకేలకు ఆరోగ్య శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండు సంవత్సరాల క్రితం నుంచి హౌసింగ్ బోర్డు పరిధిలోని ఆసుపత్రి స్థలాల్ని స్వాధీనం చేసుకోవాలని, ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే కృష్ణారావు పలుమార్లు ఆరోగ్యశాఖ అధికారులను, జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఇటీవలే కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మను చౌదరిని గత గురువారం నియోజకవర్గ కార్పొరేటర్‌లతో కలిసి ఎమ్మెల్యే కలిశారు. వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. హౌసింగ్ బోర్డుకు చెందిన ఎకరం 17 గుంటల విలువైన స్థలాన్ని వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించినప్పటికీ ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. దీంతో కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు పలువురు అధికారులు వచ్చి ఆసుపత్రికి కేటాయించిన స్థలాల్ని స్వాధీనం చేసుకున్నట్లు హౌసింగ్ బోర్డు వెస్ట్రన్ డివిజన్ ఈఈ కిరణ్ బాబు తెలిపారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కృషి చేయడమే కాకుండా స్థలాన్ని స్వాధీనం చేసే విషయంలో చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కృష్ణారావును హౌసింగ్ బోర్డు వాసులు అభినందించారు. త్వరలోనే ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి స్థలం స్వాధీనం విషయంలో అడిగిన వెంటనే స్పందించి వారం రోజుల్లోనే స్థలాల్ని స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకున్న కలెక్టర్ మను చౌదరికి ఎమ్మెల్యే కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే(ఫైల్)

జేఎన్‌టీయూలో గ్రాడ్యుయేషన్ డే

బాలానగర్: ప్రభుత్వ విద్యా సంస్థలు కోర్ ఇంజినీరింగ్ శాఖలను ప్రోత్సహించాలని, కంప్యూటర్ సైన్స్ ఎప్పుడైనా నేర్చుకోవచ్చు, కానీ కోర్ ఇంజినీరింగ్ మౌలిక స్థాయిలో నేర్చుకోవాలని తెలంగాణ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ సంచాలకులు గణపతి రెడ్డి అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉప కులపతి టి. కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఫుడ్, ఎనర్జీ, వాటర్ ఆధారంగా పరిశోధనలపై విశ్వ విద్యాలయం దృష్టి కేంద్రీకరించబోతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు, రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, వీసీ టి. కిషన్ కుమార్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయాలి

మూసాపేట: మూసాపేటలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ హరి శంకర్ తనిఖీలు నిర్వహించారు. గూడ్స్‌షెడ్ రోడ్డులో, మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద పర్యటించారు. మ్యాన్‌హోళ్ల లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేయాలని సూచించారు. వాటర్ వర్క్స్ మ్యాన్‌హోళ్లకు రెడ్ కలర్ పెయింట్ వేయాలని చెప్పారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం శివ, మేనేజర్ విలియం ప్రకాష్, వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం



మూసాపేట: మూసాపేట ప్రధాన రహదారిపై గుర్తు తెలియని మృతదేహం లభించిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మూసాపేట ప్రధాన రహదారిపై ఉన్న శ్రీకృష్ణ వైన్స్ సమీపంలో ఓ మృతదేహం ఉన్నట్లు స్థానికులు 100 డయల్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి పరిశీలించగా.. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. అతని ఒంటిపై ఎటువంటి గాయాలు లేవని, అనారోగ్య సమస్యతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అతడి పూర్తి వివరాలు తెలియకపోవటంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిస్తే కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు.

బోనాల పండుగ నిధుల కేటాయింపు

- 5 సర్కిళ్లలో సుమారు రూ. 25 లక్షలతో రోడ్ల మరమ్మతులు
- జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్

కూకట్‌పల్లి: ఆషాఢమాస బోనాల పండుగ ఏర్పాట్ల కోసం అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో పాటు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా డివిజన్ల వారీగా దేవాలయాలకు నిధులు కేటాయించినట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని 5 సర్కిళ్లకు సుమారు రూ. 25 లక్షల నిధులతో ఆలయ ముందు రోడ్ల మరమ్మతులు, లైట్లు తదితర వసతుల కల్పన వంటి పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్‌కు రూ.1.10 లక్షలు, బాలానగర్ డివిజన్‌కు రూ.1.40 లక్షలు, వివేకానందనగర్ డివిజన్‌కు రూ.1.10 లక్షలు, బాలాజీనగర్‌కు రూ.2.70 లక్షలు, అల్లాపూర్ డివిజన్‌కు రూ. 1 లక్ష, ఫతేనగర్ డివిజన్‌కు రూ.4.50 లక్షలు, ఆలి్వన్‌కాలనీ డివిజన్‌కు రూ.1.80 లక్షల నిధులను కేటాయించినట్లు ఆయన వివరించారు. అదే విధంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్లకు కూడా నిధులు కేటాయించారు. అభివృద్ధి పనులు పర్యవేక్షించేందుకు ప్రత్యేక టీంను కూడా ఏర్పాటు చేసినట్లు ఆలయ వివరించారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని 364 దేవాలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరించేందుకు రూ.10.22 లక్షల నిధులు కేటాయించామని, ఇందుకోసం 3253 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మూసాపేట సర్కిల్‌లో 72 దేవాలయాల్లో, కూకట్‌పల్లి సర్కిల్‌లో 83 దేవాలయాల్లో విద్యుత్ దీపాలంకరణకు ఇప్పటికే ఏర్పాట్లను ప్రారంభించినట్లు వివరించారు. జోన్ పరిధిలోని దేవాలయాల్లో ఎక్కడైనా అసౌకర్యంగా ఉన్నట్టైతే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.



గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఆల్విన్‌కాలనీ: రానున్న జీహెచ్ఎంసీ తదితర ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆల్విన్‌కాలనీ పటేల్ కుంట పార్కు వద్ద బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు బాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ నూతన కార్యవర్గ ప్రకటన, వికసిత్ భారత్ లక్ష్యంపై కార్యశాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో పదవులు చేపట్టిన ఉపాధ్యక్షులుగా శివ గౌడ్, కవిత, ప్రశాంత్, మురళీ, ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్ యాదవ్, సంపత్, కార్యదర్శులుగా కిరణ్, రజిని, సురేష్, మహేష్, కోశాధికారిగా విజయ్ బాధ్యతలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో కో కన్వీనర్ నరేందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, రాజిరెడ్డి, శ్రీలత, కవిత, గోవర్ధనాచారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని హెచ్ఏఎల్ పార్కులో బీజేపీ నాయకులు సమస్యలను శుక్రవారం పరిశీలించారు. వాకర్స్ వివిధ సమస్యలను వివరించారు. అనంతరం ఆ పార్టీ నాయకుడు తిరుపతి యాదవ్ మాట్లాడుతూ.. అన్ని విధాలుగా పార్కును అభివృద్ధి పరుస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఎంపీతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పార్కు సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అరుణ్, రమేష్, శేఖర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బాలానగర్: చరబండ రాజు నగర్‌లో మాలజంగం కులస్తుల శ్మశాన వాటికలో అభివృద్ధి పనులను శుక్రవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. శ్మశాన వాటికలో మౌలిక వసతులను కల్పించనున్నట్లు, పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ గుడిమళ్ల ఆశ, వర్కు ఇన్‌స్పెక్టర్ రాములు, నాయకులు కృష్ణమూర్తి, రమేష్ గుప్తా పాల్గొన్నారు.

